

ఐఎంఏ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

జగిత్యాల నవంబర్, 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో జగిత్యాల పట్టణంలోని అక్షర ఆసుపత్రి జట్టు విజయం సాధించింది. సాయి చిల్డ్రన్ ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ఐఎంఏ కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి కప్‌తో పాటు రూ.20 వేల నగదు అందించారు. రన్నర్‌గా నిలిచిన సాయి పిల్లల ఆసుపత్రి జట్టుకు రూ.10 వేల రూపాయల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గాజుల శ్రీకాంత్, డాక్టర్ పణీందర్, డాక్టర్ పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌లో 1861 కేసుల్లో రాజీ

-ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్పెషల్ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న 1861 కేసుల్లో ఇరువర్గాలను రాజీ కుదిర్చామని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో నమోదైన 66 సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులు కోల్పోయిన రూ.20 లక్షలను తిరిగి పొందేలా రిఫండ్ ప్రక్రియను స్పెషల్ లోక్ అదాలత్‌లో పూర్తి చేసినట్లు ఎస్పీ తెలిపారు. స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకే డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

జగిత్యాల టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకే జిల్లాలో విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నటు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో గడిచిన 10 నెలల్లో జిల్లా వ్యాప్తంగా 8,686 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామని తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరుతున్న పేదల సొంతింటి కల

-వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారుకు చీరను కానుకగా అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం వల్ల నిరుపేదల సొంతింటి కల నెరవేరిందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలంలోని పోతారంలో ఆదివారం పెంటల బుజ్జమ్మ అనే లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణం పూర్తి కాగా నూతన గృహ ప్రవేశంకు హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళలోనే రేషన్‌కార్డులు, రూ.2 లక్షల రుణమాఫీ, ఉచిత ఆర్టీసీ బస్సు సదుపాయం, సన్న బియ్యం, 200 యూనిట్ల గృహ వినియోగదారులకు ఉచితం వంటి పథకాలు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోను న్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ దేశంలోనే ఆదర్శంగా ఉండేలా ప్రజాపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకుని బిల్లులు సకాలంలో పొందాలని సూచించారు. అనంతరం లబ్ధిదారురాలికి చీరెను కానుకగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం,ఎగ్యారపు శ్రీహరి, కారపు గంగాధర్, జక్కుల లక్ష్మీనారాయణ, గంగాధర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే వైద్యులకు గుర్తింపు

-ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అరుణి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

జగిత్యాల అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే వైద్యులకు గుర్తింపు లభిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. జగిత్యాల పట్టణంలో ఆదివారం డాక్టర్ ఆగంతపు నరేష్‌కు చెందిన అరుణి ఆసుపత్రిని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతిలతో కలిసి ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యుడంటే దైవంతో సమానంగా ప్రజలు భావిస్తారన్నారు. నరేష్ గతంలో అనేక స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గాజంగి నందయ్య, మిట్టపెల్లి సుధర్శన్, దారం ఆదిరెడ్డి, అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, దావ సురేష్, అడువాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుపై ఉత్కంఠ



- నేటి రాష్ట్ర కేబినెట్ నిర్ణయమే కీలకం
- పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు సర్కారు మొగ్గు..?
- జిల్లాలో 20 జడ్పీటీసీ, 385 సర్పంచ్ స్థానాలు

జగిత్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణ యంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ విజయం సాధించడంతో అదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికల వైపు వెళ్లడానికి ఆ పార్టీ అధిష్ఠానం పచ్చజెండా ఊపినట్లు ప్రచారం జరుగుతోంది. సోమవారం నిర్వహించనున్న కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వ హణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటి వరకు నెలకొన్న సందిగ్ధతకు ఇకనైనా తెరపడుతుందా..? లేక అలాగే కొనసాగుతుందా...? అనేది కేబినెట్ సమావేశంలో తీసుకునే నిర్ణయంతో తేలనుంది.

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికల నిర్వహణకు సిద్ధపడగా అందుకు న్యాయ పరమైన చిక్కులు తలెత్తిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రక్రియకు ముందడుగు పడలేదు. కోర్టు నిర్ణయానికి అనుగుణంగానే ఎన్నికలకు వెళ్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర మంత్రివర్గం తీసుకునే నిర్ణయంపై ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నిలిచిన నిధుల విడుదల..

జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, పంచాయతీలు, మున్సిపాలిటీలకు పాలక వర్గాలు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో ఎన్నికలు త్వరగా నిర్వహించాలనే అభిప్రాయం అంతటా వినిపిస్తోంది. గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి దాదా పుగా ఏడాది న్నర అయింది. మండల పరిషత్, జిల్లా పరిషత్ వర్గాలు, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మ పురి, రాయికల్ మున్సిపల్ పాలకవర్గాల గడువు ముగిసి సుమారు ఏడాది దాటింది.

ప్రస్తుతం వీటన్నింటిలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సం ఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల విడుదల పూర్తిగా నిలిచిపోయింది. దీంతో స్థానిక వనరులపై ఆధార పడాల్సి వస్తోంది. సరిపడా నిధులు లేక అభివృద్ధిపై ప్రభావం చూపు తోంది. కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్ డీజిల్, వాహనాల కిస్తీలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. పారిశుధ్యం, తాగునీటి పనులకు పంచాయతీ సెక్రెటరీలు అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో స్థానిక ఎన్ని కలు నిర్వహించాలనే డిమాండ్ ప్రజల్లో బలంగా ఉంది.

కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్ల యోచన

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితాలు కాంగ్రెస్‌లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీన కేబినెట్ సమావేశం జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇందు లో బీసీ రిజర్వేషన్ల అమలు, ఎన్నికల నిర్వహణకు తీసుకునే నిర్ణయాలను నివేదిక రూపంలో హైకోర్టుకు అందించే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు వెళ్తారా..? లేదా 42 శాతం రిజర్వే షన్లకు చట్ట బద్ధత లభించాకే ఎన్నికలు నిర్వహించేలా నిర్ణయం

మిగతా 8వ పేజీలో

జిల్లాలో స్థానిక సంస్థల వివరాలు

జడ్పీటీసీ స్థానాలు	20
ఎంపీటీసీ స్థానాలు	216
ఎంపీపీ స్థానాలు	20
సర్పంచ్ స్థానాలు	385
వార్డులు సభ్యులు పంచాయతీ	3,586
ముసాయిదా ఓటర్లు	6,07,222
పురుషులు	2,89,249
మహిళలు	3,17,964
ఇతరులు	9

జగిత్యాల రూరల్ ఎస్సైగా ఉమాసాగర్

జగిత్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ ఎస్సైగా ఉమాసాగర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఉమాసాగర్‌ను జగిత్యాల రూరల్ ఎస్సైగా ఆదివారం నియమిస్తూ జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జగిత్యాల రూరల్ ఎస్సైగా పనిచేసిన సధాకర్ ను డీసీఆర్‌బీ బదిలీ చేశారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఉమాసాగర్‌ను పోలీసు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

దుప్పట్ల పంపిణీ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని స్థానిక స్వామి వివేకానంద స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టీఆర్‌నగర్ వృద్ధాశ్రమం, గుట్టరాజేశ్వర స్వామి అనాథ వృద్ధాశ్రమంలో 50దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు నేరెళ్ల వెంకన్న, కార్యదర్శి శ్రీనివాస్, బాల శేఖర్, గౌతంరెడ్డి, విఠలయ్య, రామారావు, శ్రీనివాస్, మల్లేశంతో పాటు వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

తులసీ కల్యాణం

భీమారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భీమారం మండంలోని రంగాపూర్ గ్రామంలో తులసి దామోదర కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక మాస వన భోజనాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, మాజీ జడ్పీటీసీ కుందారపు జలందర్, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మాజీ సర్పంచులు అంగడి ఆనంద్, శ్రీపతి దామోదర్, రావు శ్రీనివాస రావు, అజాం, మారుతీ గౌడ్, పుల్లూరి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అసిస్టెంట్ కుక్, మోడల్ స్కూల్‌లో హెడ్ కుక్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెడ్ కుక్ 10వ తరగతి, అసిస్టెంట్ కుక్ 7వ తరగతి చదువుకొని మహిళా అభ్యర్థులై ఉండాలన్నారు. ఈ నెల 18లోపు కస్తూర్బాగాంధీ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించుకోవాలని కోరారు.

●**మల్యాల:** మండలంలోని నూకపల్లి మోడల్‌స్కూల్ వసతిగృహంలో ఏఎన్ఎం, హెడ్‌కుక్, నైట్ వాచ్‌ఉమెన్ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎస్.జయసింహరావు తెలిపారు. ఈనెల 19లోగా మోడల్‌స్కూల్‌లో దరఖాస్తులు అందించాలని కోరారు.

● **కస్తూర్బాలో..**

మల్యాలలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అసిస్టెంట్‌కుక్ నియామకం కోసం ఆసక్తిగల మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో జయసింహరావు తెలిపారు. ఏడవ తరగతి ఉత్తీర్ణులై, వంట చేయడంలో అనుభవం గల వారు ఈ నెల 19లోపు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

●**వెల్గటూర్:** వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లె మాడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్ (వంట సహాయకురాలు) నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండి స్వశక్తి మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉన్నవారు అర్హులని అన్నారు. గతంలో మధ్యాహ్న భోజన కార్మికులుగా చేసిన వారికి ప్రాధన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 18న మండల వనరుల కేంద్రంలో ఉదయం 11 గంటల నుండి ఒంటి గంట వరకు నియామక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

సమస్యల వలయంలో నాయకపుగూడెం

- నిర్మాణానికి నోచుకోని మురికి కాలువలు, సీసీ రోడ్లు

- తాగు నీటికి తిప్పలు

బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడెంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గూడెంలో సీసీ రోడ్డు, మురికి కాలువలు లేవు. ప్రజలకు తాగు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

7



కండ్లపల్లి నుంచి నాయకపుగూడెంకు వెళ్లే దారి

ధాన్యం కొనుగోలు చేయడం లేదని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

కొడిమ్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆదివారం కొడిమ్యాల మండలం పూడూర్ రోడ్డుపై రైతులు రాస్తారోకో చేశారు. కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని పూడూర్ రోడ్డుపై ఆదివారం మండల రైతు వేదిక అధ్యక్షుడు ఏలేటి నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయటం లేదని ఆరోపిస్తూ రాస్తారోకో చేసారు. రాస్తారోకో చేస్తున్న రైతులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం 40 కిలోల బ్యాగ్ ఒక్కంటికి అదనంగా మూడు కిలోలు డిమాండ్ చేస్తు రైతులను రైస్ మిల్లర్లు ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు సహకరించాలని నినాదాలు చేసారు. భవిష్యత్తులో రైతులకు ఇలాంటి పరిస్థితిని రైతులకు మిల్లర్లు, అధికారులు కలిపిస్తె ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. సమాచారం అందుకున్న కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమించాలని రైతులకు నచ్చ చెప్పటానికి ప్రయత్నాలు చేసారు. కొంత సేపు పోలీసులకు రైతులకు మధ్య పెనుగలాట జరిగింది. రాస్తారోకో జరుగుతున్నంత సేపు ఎటువైపు వాహనాలు అటువైపు నిలిచి పోవటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ రాస్తారోకో స్థలానికి చేరుకొని రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. గతంలో కొనుగోలు చేసిన విదంగానె కొనుగోలు చేయిస్తామని హామీ ఇవ్వటంతో రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో ఏలేటి నర్సింహరెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహరెడ్డి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, రైతు నాయకులు రవికుమార్, చంద్రమొహన్, సంజీవరెడ్డి, హరీష్, తిరుపతిరెడ్డి, నరేష్, మల్లారెడ్డి, మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ముందస్తు వ్యాధి నిర్ధారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాయికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముందస్తు వ్యాది నిర్ధారణతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపల్లి రంజిత్ అన్నారు. రాయికల్ పట్టణంలోని అంగడి బజార్ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో 87 మందికి ఉచితంగా షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బెక్కం తిరుపతి, డీసీ బత్తిని భూమయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, సాంబారు శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్లు మోసారపు సంతోష్, ప్రణయ్, బోగ రాము తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

మెట్‌పల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం లోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన పుల్ల జగన్‌గౌడ్‌ను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడు తున్న జగన్ ఇంటికి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ డాకూరి వెంకటేష్, ముదాం నర్సింహులు, రంగు మహేష్, కొమ్ము రవి, ముదాం అనిల్, పుల్ల వెంకటేష్, పూదరి తిరుపతి, తదితరులు ఉన్నారు.

‘వెట్టి చాకిరి విముక్తి కోసం సీపీఐ పోరాటం’



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

జగిత్యాల అర్బన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం సీపీఐ ఎన్నో రాజీలేని పోరాటాలు చేసిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలు పోరాటాలు, త్యాగాల శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నవంబర్ 15న ప్రారంభమైన ప్రచారజాతా ఆది వారం జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో జరిగిన కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన పార్టీ సీపీఐ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్ళపెల్లి శ్రీనివాస్‌రావు, కలవేన శంకర్, మారుపాక అనిల్ కుమార్ జగిత్యాల సిపిఐ నాయకులు మాడిశెట్టి కిరణ్, వెన్న సురేష్, వెన్న మహేష్, హనుమంతు, అక్రమ, దుర్గయ్య, గంగరాజం, కొక్కుల శాంత, తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** భారత దేశానికి స్వాతంత్ర్య కావాలని తొలుత గర్జించింది భారత కమ్యూనిస్టు పార్టీయే అని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చేపట్టిన ప్రచార జాతా ఆదివారం ధర్మపురి చేరుకుంది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మిక, విద్యార్థి, యువజన, రైతు, మహిళా తదితర ప్రజా సంఘాలను నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిందని ఆయన వివరించారు. సింగరేణి కార్మికుల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని ఆయన పేర్కొ న్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజాకర్షక నినాదాలతో అధికారం చేజిక్కించుకున్న బీజేపీ అవేమి అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. డిసెంబరు 26న నిర్వహించే ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్క ళ్లపెల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కలవేన శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, ప్రజానాట్య మండలి కార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ పోస్టును భర్తీ చేయండి

మల్లాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిపేట గ్రామ పంచాయతీలో గత ఐదేండ్లుగా కాలిగా ఉన్న బిల్ కలెక్టర్ పోస్టును త్వరగా భర్తీ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. మండలంలోనే అతి పెద్ద గ్రామమైనప్పటికి అధికారులు కాలిగా ఉన్న బిల్ కలెక్టర్ పోస్టును భర్తీ చేయడంలో జాప్యం చేయడంపై వాపోయారు. ఇక్కడ పని చేసిన బిల్ కలెక్టర్ మధు బదిలీపై వెళ్ళినప్పటి నుండి పోస్టు ఖాళీగానే ఉందని స్థానికులు పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీలో ఉండాల్సిన కంప్యూటర్ సైతం లేదని దీంతో ఆన్‌లైన్ సేవల్లో ఇబ్బదులు పడుతున్నట్లు మొగిలిపేట ప్రజలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు సైతం కాలిగానే ఉందని, అధికారులు దృష్టి సారించి మొగిలిటే గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను తీర్చాలని కోరినారు.

నియామకం

మల్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా, న్యాయ సలహాదారుగా మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన మాజీ ఎంపీపీ తైదల శ్రీలత నియమితులయ్యారు. ఈ మేరకు ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు దేవనంద నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీలతను జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి లక్ష్మీరాజం, మల్యాల మండల అధ్యక్షుడు బెజ్జంకి చిన్నదుర్గయ్య తదితరులు అభినందించారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చందుర్తి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన పల్లి రవిగౌడ్ అనే గీతకార్మికుడు శనివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి గాయపడ్డాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. రవి రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవ శాత్తు మోకుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి రవిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ బస్టాండ్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలవగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని ఆముదాలపల్లికి చెందిన కందుల రాజు తిమ్మాపూర్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో తాడికల్ బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన అన్వర్‌పాషా రోడ్డు క్రాస్ చేస్తుండగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాజుకు ఎడమ కాలు విరిగింది. అన్వర్‌పాషాకు కుడి కాలుకు గాయమైంది. గమనించిన స్థానికులు 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి గ్రామంలో రోడ్డుపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తితో పాటు గుర్తు తెలియని కారు గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

పాఠశాలలో కూరగాయల తోటలు



పాఠశాలలో సాగు చేసిన కూరగాయల మొక్కలు

- తల్లిదండ్రుల సహకారంతో నిర్వహణ
- ఫలితాలిస్తున్న విటమిన్ గార్డెన్లు

గంగాధర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహార కూరగాయల సాగుకోసం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న విటమిన్ గార్డెన్లు సత్ఫలితాలనందిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏర్పాటు చేసిన గార్డెన్లలో నాటిన మొక్కలు నేడు కాతకొచ్చాయి. గంగాధర మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆదేశాలతో విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నాటిన కూరగాయల మొక్కలు కొన్ని పాఠశాలలో కోతులు ధ్వంసం చేస్తుండగా గర్శకుర్తి పాఠశాలలో మాత్రం కూరగాయలు కోతకొస్తున్నాయి.



మొక్కకు నీరు పోస్తున్న విద్యార్థినులు

విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం

ఇక్కడి పాఠశాలలో గార్డెన్ నిర్మించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉంది. ఉపాధ్యాయులు పాఠశాల వెనకాల ఖాళీ ప్రదేశంలో విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు మొక్కలకు కావలసిన పోషకాలనందించేందుకు ప్రత్యేకంగా మట్టిని ట్రాక్టర్లతో తెప్పించారు. తెచ్చిన మట్టిని తల్లిదండ్రులే గార్డెన్‌లో పోశారు. కూరగాయల గార్డెన్‌లో నాటిన మొక్కల సంరక్షణను ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరిస్తూ వాటికి నీరందిస్తున్నారు. పాఠశాల ముగిసే సమయంలో వాటిని కాపాడేందుకు చుట్టు ట్రీగార్డ్స్‌ను రక్షక కవచంగా ఏర్పాటుకు ఉపాధ్యాయులు సొంత ఖర్చులను వెచ్చించారు. ఇక్కడి గార్డెన్‌లో బచ్చలి కూర, పాలకూర, టమాట, కొత్తిమీర, వంకాయ, సోర, మెంతి, కాలిఫ్లవర్, మునగ వంటి కురగాయల మొక్కలను నాటారు. ఈ మొక్కలను ప్రత్యేకంగా కరీంనగర్ నుంచి తీసుకొచ్చి పెంచుతున్నారు. ప్రస్తుతం బచ్చలికూర, పాలకూర, టమాట, కొత్తిమీర కోతకు వచ్చింది. ఉపాధ్యాయులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం తయారు చేసుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తు మొక్కలను కాపాడుతున్నారు.

విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగుల మందు పార్టీ

- ముగ్గురి సస్పెన్షన్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్‌ఉద్యోగులు శనివారం రాత్రి మందుపార్టీ చేసుకున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో స్పందించిన విద్యుత్ ఉన్నతాధికారులు ఆదివారం ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్‌చేశారు. జగిత్యాలసర్కిల్ కార్యాలయంలో టౌన్-1 సెక్షన్ కార్యాలయ ఓయం స్టాఫ్‌రూంలో శనివారం అసిస్టెంట్ లైన్‌మెన్లు ప్రభాకర్, బాలకృష్ణ, రాజశేఖర్ మందు పార్టీ చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. వారిని సస్పెండ్ చేసినట్లు జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గంగారాం తెలిపారు. ఈ ఘటనపై సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 17సర్కిళ్లలోని అన్ని సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ సంస్థ కార్యాలయాలు విద్యుత్ సంస్థ కార్యాలయాల్లో క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా..

మానకొండూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని స్థానిక పెద్ద చెరువు ప్రాంతంలో ఆదివారం లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడింది. ఐతరాజుపల్లి నుంచి శంకరపట్నం మండలంలోని మొలంగూరుకు సీడ్ వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. ధాన్యం బస్తాలు రోడ్డు వెంట పడిపోవడంతో స్థానికుల సహాయంతో బస్తాలను రోడ్డు పక్కకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలకులు మారుతున్నా ప్రజల బతుకులు మారలేదు

- ఎజెండాలతో కాకుండా ఎర్రజెండాతో పోరాడుదాం
- సీపీఐ నాయకులు చాడ వెంకటరెడ్డి



ఎడ్ల బండిపై సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకటరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో పాలకులు మారుతున్నా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని సీపీఐ సీనియర్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొమురం భీం జిల్లా నుంచి ప్రారంభమైన కళాజాతా ఆదివారం రాత్రి వేములవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో డిసెంబరు 26, 1925న పుట్టిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకే వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను కాలరాసి రైతులు, కార్మికులు నిరసన తెలిపే హక్కు లేకుండా చేశారని విమర్శించారు. దేశంలో ఇంకా కూడు, గుడ్డ కోసం నిరుపేద ప్రజలు తల్లాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎజెండాలను పక్కన పెట్టి ఎర్రజెండాను పట్టి హక్కులను సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. డిసెంబరు 26న ఖమ్మం జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ నుంచి తిప్పాపూర్ వరకు ఎడ్ల బండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు కడారి రాములు, మారుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విషమంగా అశ్రిత్ ఆరోగ్య పరిస్థితి

- అర్చన మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
- కూల్‌డ్రింక్ బాటిల్ సీజ్
- పోలీసుల అదుపులో మల్లేశం?

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అనవేని అశ్రిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో శనివారం సాయంత్రం అంగవైకల్యంతో ఉన్న అర్చన(15), అశ్రిత్(17) ఇంట్లో అపస్మారకస్థితిలో ఉండగా తల్లి పోషవ్వ గమనించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అప్పటికే అర్చన మరణించగా, అశ్రిత్ చికిత్స అందిస్తున్నారు. తల్లి పోషవ్వ మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇద్దరు పిల్లలు స్పృహ కోల్పోయి ఉండడం, ఆమె భర్త మల్లేశం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తండ్రే కూతురు, కొడుకును హత్యచేసేందుకు ప్రయత్నించాడా? అనిపోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా నిర్ధారించ లేకపోతున్నారు. సంఘటన జరిగిన ఇంటిలో ఒక కూల్‌డ్రింక్ బాటిల్‌తోపాటు మరికొన్ని ఆధారాలను పోలీసులు సేకరించారు. కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఇద్దరు పిల్లలచేత తాగించాడా? లేదా గొంతునులిమి హత్య చేశాడా? మరే కారణమనేది వారితండ్రి మల్లేశం పట్టుబడితేగానీ తెలియని పరిస్థితి నెలకొందని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తరువాతనే నిర్ధారణ అవుతుందని త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. అర్చన గొంతు వద్ద గాయాలను పోలీసులు గుర్తించారు. అర్చన మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం పూర్తిచేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం రాత్రి మల్లేశంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

పాముకాటుతో మహిళా రైతు మృతి



రమాదేవి(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మహిళారైతు సుదాటి రమాదేవి(50) పాముకాటుతో మృత్యువాతపడింది. మృతురాలి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఆదివారం సుదాటి రమాదేవి పొలాన్ని హార్వెస్టర్‌తో కోయిస్తోంది. ఈ క్రమంలో అక్కడక్కడ మిగిలిపోయిన వరికర్రలను కొడవలితో కోస్తుండగా ప్రమాదవశాత్తు పాముకాటు వేసింది. వెంటనే ఆమెను కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త సుదాటి సత్యనారాయణరావుతో పాటు కుమారుడు మాజీఉపసర్పంచ్ సుదాటి కరుణాకర్‌రావు, కూతురు కర్ణ ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే రమాదేవి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



లింగం(ఫైల్)

చందుర్తి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో విద్యుదాఘాతంతో ఆదివారం ఓ రైతు మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంబీరీ లింగం(65) అనేరైతు ఇంటి నుంచి మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గరకు వెళ్లిన తండ్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుమారుడు పూర్ణచందర్ పొలం వద్దకు వెళ్లి చూడగా, మోటార్ స్టార్టర్ బాక్స్ వద్ద పడి ఉన్నాడు. వెంటనే స్థానికంగా ఉన్న రైతులను పిలిచి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య తార గత కొన్ని సంవత్సరాల క్రితం బెజ్జంకి మండలంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందింది. కుమారులు పూర్ణచందర్, రాజు, కూతురు సంపూర్ణ ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఏఎస్ఐ ఆనంద్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల శివారులోని మానేరు నదిలో దూకి చింతకింది సోమయ్య(55) అనేవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..సిరిసిల్ల పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన సోమయ్య పవర్‌లూం కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం కంటి ఆపరే షన్ కాగా సరైన ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన సోమయ్య మానేరు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సోమయ్య మృతదేహాన్ని మానేరు నదిలో చూసిన జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో పాటు ఉపాధిలేక ఆర్థికఇబ్బందులతో మనస్థాపం చెంది సోమయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘ టనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంతోషంగా వచ్చి.. విగత జీవిగా మారి



శివాసిని(ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న పెద్దమ్మకొడుకు సోదరుడిని తీసుకెళ్లడానికి పెద్దమ్మ, నాన్నమ్మతో కలిసి వచ్చిన బాలిక రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఘటన ఆదివారం సుల్తానాబాద్‌లో చోటుచేసుకుంది. జగిత్యాలజిల్లా బీర్పూర్ మండలం తొంగురు గ్రామానికి చెందిన రాణి, అత్త లక్ష్మితో కలిసి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌లో చదువుకుంటున్న కొడుకు శ్రావణ్ వద్దకు వెళ్లడానికి సమాయత్తమయ్యారు. వారివెంట వస్తానని రాణి మరిది కిషోర్ కూతురు శివాసిని(8) కోరగా ఆమెనుకూడా వెంట తీసుకొని ముగ్గురు సుల్తానాబాద్ చేరుకున్నారు. హాస్టల్‌లో చదువుకుంటున్న రాణి కొడుకు శ్రావణ్‌ను కలిసి మళ్లీ స్వగ్రామానికి వెళ్తామని హాస్టల్ నుంచి సమీపంలోని రాజీవ్‌రహదారి వద్దకు వచ్చారు. పెద్దపల్లి వైపు బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటేయత్నంలో శివాసిని కరీంనగర్ వైపు నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో శివాసిని ఎగిరి రోడ్డుపై పడటంతో అక్కడిక్కడే మృతిచెందింది. మృతురాలి తండ్రి కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి బాలిక మృతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మారం మండలం బొట్లవనపర్తికి చెందిన కత్తెర్ల లక్ష్మణ్, భార్య ఇద్దరు కూతుళ్లతో పెద్దపల్లికి వచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్తున్న క్రమంలో కాసులపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గమనించక బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. పెద్ద కూతురు సాయి పావని (13) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకల్వల వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాపెల్లి రాజేశం(80) అక్కడిక్కడే మృతి చెందాడు. రాజేశం రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోని చెత్తను రోడ్డు ఆనుకుని ఉన్న డంపులో పారబోసి, తిరిగి ఇంట్లోకి వెళుతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు అతివేగంతో వస్తున్న టీఎస్22జె6966 కారు ఢీ కొట్టింది. దీంతో రాపెల్లి రాజేశం ఎగిరి కొంతదూరంలో రోడ్డుపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలోని హోటల్ లివింగ్ ట్రీలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పట్టుకున్నట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. వారి వద్ద నుంచి 38,060 రూపాయల నగదుతోపాటు ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆవులను ఎత్తుకెళ్లిన దొంగలు

గన్నేరువరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన బండి కనుకయ్య, న్యాలపట్ల ఎల్లయ్య, సుదగోని మహేందర్, పంబాల కొమురయ్యకు చెందిన నాలుగు ఆవులను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు ఆవులను పశువుల పాకలో కట్టేసి ఉంచారు. దొంగలు ఆవులను వాహనంలో ఎక్కించి అపహరించారు. ఒక్కో ఆవు ధర సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.

నగదు అపహరణ

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన బూర్ల బాలయ్య ఇంట్లో దొంగలుపడి బీరువాలోని రూ.50 వేల నగదును అపహరించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బాలయ్య గ్రామపంచాయతీలో పనిచేస్తుండగా అతనిభార్య కూలీపనులకు వెళ్లింది. శనివారం ఇంటికి ఉన్న తాళంతీసిన దొంగలు నగదును ఎత్తుకెళ్లారు. దొంగలుపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎస్సై సిరిసిల్ల అశోక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యుత్ మోటార్ కేబుల్ చోరీ

ఓదెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం రాత్రి నలుగురు రైతులకు చెందిన 80 మీటర్ల విద్యుత్ మోటార్లకు ఉండే రాగివైర్ చోరీకి గురయ్యింది. గూడెంలో బుడిగె సతీష్ 30 మీటర్లు, వీరముష్టి శ్రీనివాస్ 25మీటర్లు, బుడిగె కుమారస్వామికి చెందిన 20మీటర్లు, గుంపులకు చెందిన మరో రైతు సల్లాల ప్రశాంత్‌కు చెందిన 25మీటర్లు మొత్తం 80 మీటర్ల రాగి వైర్ గుర్తు తెలియని దుండగలు ఎత్తుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం నారుమడులు సిద్ధం చేసుకునే సమయంలో రాగివైర్లను దొంగిలించడంతో రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క మోటార్‌కు ఉన్నవైరు మళ్లీకొనుగోలు చేయాలంటే రూ.3500నుంచి రూ.4వేల వరకు ఖర్చవు తుందని రైతులు పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రిని ఎత్తుకెళ్లిన దొంగలు

చొప్పదండి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో కాట్నపల్లి ఫీడర్ పరిధిలోని ఎస్ఎస్-5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎతుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని సామగ్రి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం గమనించిన రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.

ప్రమాదాలకు నిలయంగా మూల మలుపులు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి



కథలాపూర్ శివారులో ఉన్న ప్రమాదకర మూల మలుపు



పోసానిపేట ఎల్లమ్మ గుడి వద్ద మూల మలుపు

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పలు రహదారుల మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వేములవాడ-కోరుట్ల రహదారిపై కథలాపూర్, పోసానిపేట శివారుల్లో అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల దగ్గర నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఏ వాహనం దూసుక వస్తుందనే విషయం తెలియక అనేకమంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు.

- సూచికల ఏర్పాటులో నిర్లక్ష్యం..

ఈ మూలమలుపుల వద్ద లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలు, టిప్పర్లు ఢీకొట్టిన ఘటనల్లో ఇప్పటికే దాదాపు 20మంది ప్రాణాలు వదిలినట్లు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ రోడ్డు మరియు భవనాల శాఖ అధికారులు ఇప్పటికీ మూల మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వారినిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. ఏటేటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుంటే ప్రమాదాల నివారణపై ఎందుకు శ్రద్ధచూపడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వేములవాడ-కోరుట్ల రహదారిపై ప్రతీనిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేములవాడకు శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి ఈ రోడ్డు వెంటే భక్తులు వెళ్తుంటారు. ఈ మధ్య కాలంలో మూలమలుపుల వద్ద మరణిస్తున్న వారి సంఖ్య పెరిగింది. కాగా పోలీసులు సంఘటనలు జరిగిన సందర్భాల్లో తాత్కాలికంగా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తుండడం పరిపాటిగా మారుతోంది.

- ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- అజారొద్దీన్, జూనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో కార్యాలయం, మెట్‌పల్లి



ప్రతీదినం ఈ రోడ్డుపై కార్యాలయంకు వెళ్ళి వస్తుంటాను. మూల మలుపుల వద్దకు రాగానే భయపడాల్సి వస్తోంది. ఏ వాహనం రూపంలో వచ్చి మృత్యువు కబళిస్తుందని ఆందోళన తప్పడం లేదు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

- హైలెవెల్ బ్రిడ్జిగా మార్చాలి..

- ఎంజీ రెడ్డి, మాజీ సర్పంచ్, పోసానిపేట



పోసానిపేట ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న మూల ములుపు వద్ద చాలాసార్లు ప్రమాదాలు జరిగి అనేక మంది మరణించారు. అదే ప్రాంతంలో లోలెవెల్ కల్వర్టు ఉండడంతో ప్రమాదాలకు మరింత ఆస్కారం ఏర్పడుతోంది. అక్కడ హైలెవెల్ వంతెన నిర్మించి ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

ఘనంగా కేతేశ్వర-కంకాలమ్మ జాతర

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం అంబారిపేటలో ఆదివారం శ్రీకేతేశ్వర సహిత కంకాలమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక మేదరి సంఘం అధ్వర్యంలో గ్రామ శివారులో ఉన్న స్వామి సన్నిధిలో భక్తులు స్వామివారల దర్శనానికి భక్తులు బారుల తీరారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు స్వామివారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మేదరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళలు

పరుగు పోటీలో..

జాతీయ స్థాయికి ఎంపికైన ఆనంది



జాతీయ స్థాయికి ఎంపికైన నల్లవెల్లి ఆనంది

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని నల్లవెల్లి ఆనంది అండర్17 విభాగంలోని 800, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లిశంకర్, భారతిల రెండోవ కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. గతంలో ఒడిశా రాష్ట్రరాజధాని భువనేశ్వర్‌లోని కలింగస్టేడియంలో నిర్వహించిన 40వ జాతీయచాంపియన్‌షిప్ అండర్16 విభాగంలో మూడోస్థానంలో నిలిచి బ్రౌంజ్‌మెడల్ సాధించింది. వచ్చే నెలలో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆనంది పాల్గొంటారు. ఆమె ఎంపికపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు అభినందించారు.

రాజన్న ఆలయ దక్షిణ ప్రాకారం కూల్చివేత


రాజన్న ఆలయంలో ముమ్మరంగా సాగుతున్న విస్తరణ పనులు


వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపనుల్లో భాగంగా 46ఏళ్లచరిత్ర కలిగిన ఆలయం చుట్టూ ఉన్న దక్షిణంవైపు ప్రాకారం కూల్చివేత పూర్తయింది. ఇదే ప్రాంతంలోని కోటిలింగాలను తొలగించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇందుకు శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతిస్వామి అనుమతించారు. అంతకు ముందు ఒకసారి పురాతన ప్రాకారం తొలగించి 1979లో పునరుద్ధరించారు. అపుడు దాదాపు ఏడాదిపాటు నిర్మించిన ఈ ప్రాకారాన్ని విస్తరణలో భాగంగా రెండోసారి తొలగించాల్సి వచ్చింది. ఆలయం చుట్టూ ఇరుకుగా లేకుండా ఉండేందుకు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నూతన ప్రాకారం నిర్మించడానికి రూపకల్పన చేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు


యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14,-17 యోగాపోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ ఫెయిర్, ఆర్టిస్టిక్ ఫెయిర్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ట్రెడిషనల్ అండర్-17 బాలికల విభాగంలో సహస్రలక్ష్మి(కరీంనగర్), ఎ.తనిష్క(వరంగల్), బి.శిరీష(నిజామాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో టి.హరీష్ బాలాజీ(కరీంనగర్), పి వినయ్‌కుమార్ (సిద్ధిపేట), మోయిన్ (రంగారెడ్డి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఆర్టిస్టిక్ సింగిల్‌అండర్-17 బాలికలవిభాగంలో బి.సహారతి (నిజామాబాద్), ఎం. స్వాతిక(మెదక్), ఎస్.మహేశ్వరి(ఆదిలాబాద్), బాలుర విభాగంలో ఎస్. రాంచరణ్(మెదక్), ఆర్.శశివర్ధన్(ఆదిలాబాద్), ఎ. విశాల్ (నిజామాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారు. ట్రెడిషినల్ అండర్-17 బాలికలవిభాగంలో సీహెచ్ సహస్ర (నిజామాబాద్), టి.కమలిని(కరీంనగర్), బి.సరిసమ(వరంగల్), బాలుర విభాగంలో ఎస్.సమన్విత్(వరంగల్), పి.అఖిల్(కరీంనగర్), శ్రీహరి ప్రసాద్(హైదరాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరితోపాటు రిథమిక్ ఫెయిర్, ఆర్టిస్ట్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ నిర్వహణకార్యదర్శి బసబోయిన వేణుగోపాల్, రాష్ట్ర పరిశీలకులు టి సతీష్, ఎన్. శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, నిర్వాహకులు వీర్ల హనుమంతరావు, వెలిచాల యూత్‌సభ్యులు,పీడీలు,పీఈటీలు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు భరోసా




- 11 నెలల్లో 39 మందికి ఆర్థిక సహాయం
- 63 కేసుల్లో న్యాయసహాయం, 43మందికి వైద్యసేవలు
- 11మందికి రూ.3.5లక్షల నష్టపరిహారం అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు కరీంనగర్ శివారులో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం అండగా నిలుస్తున్నది. కమిషనరేట్ పరిధిలో మహిళలపై జరుగుతున్న వివిధరకాల నేరాల్లో బాధితులకు న్యాయ సహాయం అందిస్తోంది. సైబర్‌నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది. మహిళా బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, లైంగిక, ఇతర రకమైన వేధింపులు, నేర ఘటనల్లో ఎలా?ఎవరికి? ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి? అనే విషయాల్లో బాధితులకు భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని రకాల సమాచారం

భరోసా కేంద్రం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం పర్యవేక్షణలో నడుస్తున్నది. భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సెలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎస్ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్నిరకాల సమాచారంతో పాటు సహాయాన్ని అందిస్తారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో 2022 సంవత్సరంలో మహిళా బాధితులకు సంబంధించి 498 కేసులు నమోదుకాగా 2023 సంవత్సరంలో 565 కేసులు నమోదయ్యాయి.

- 2024 డిసెంబరు 22న కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వైద్యకళాశాల పక్కన ఈ భరోసా కేంద్రాన్ని అప్పటి డీజీపీ జితేందర్ ప్రారంభించారు. కోటి 70 లక్షల రూపాయలతో వెయ్యి చదరపు గజాల స్థలంలో 6,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక వసతులతో నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో భరోసా కేంద్రం, మొదటి అంతస్తులో షీటీమ్స్, రెండో అంతస్తులో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ (మానవ అక్రమ రవాణా) విభాగాలు ఉంటాయి. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయసహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- 2024 డిసెంబరు నుంచి ఇప్పటివరకు 45 పోక్సో కేసులు, 25 లైంగిక వేధింపులు, మూడు ఇతర కేసుల్లోని బాధితులకు భరోసా సిబ్బంది న్యాయ సహాయం చేశారు. 59 కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 180ప్రకారం, 54 కేసుల్లో బాధితుల నుంచి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 183ప్రకారం స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. 43 మందికి వైద్య సహాయం అందించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నష్టపరిహారం కోసం 39మంది బాధితుల తరఫున దరఖాస్తులు సమర్పించగా, ఇప్పటివరకు 11 మంది బాధితులకు మూడు లక్షల యాభై వేల రూపాయలు అందజేశారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు

- జిల్లా విద్యాధికారి రాము
- ఘనంగా అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రాము, డీవైఎస్‌వో రవి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని జిల్లా విద్యాధికారి రాము, జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం స్థానిక అకడమిక్ హైట్స్ పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 17 బాల బాలికల చెస్ సెలక్షన్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు జిల్లా విద్యాధికారి రాము, జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చెస్ ద్వారా విద్యార్థులకు ఆలోచనాత్మక శక్తితో పాటు, మానసిక ఉత్తేజం సిద్ధిస్తుందన్నారు. జగిత్యాల జిల్లాను క్రీడల పరంగా ముందు వరుసలో ఉంచేందుకు ఎల్లవేళలా తమవంతు తోడ్పాటును అందిస్తామని తెలిపారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్రధర్‌రావు మాట్లాడుతూ మొదటిసారిగా జగిత్యాల జిల్లాలో చెస్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఉమ్మడి 10 జిల్లాల నుంచి 100మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ పోటీల్లో ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికవగా, త్వరలో జాతీయ స్థాయిలో జరగబోయే చెస్ టోర్నీకి ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఈటీలు విశ్వప్రసాద్, రాజమల్లయ్య, శ్రీనివాస్, రిఫరీ మట్టయ్య, చీఫ్ ఆర్బిటార్ అనిల్, జిల్లాకు చెందిన పలువురు పీఈటీలు, పాఠశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

రామగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను రామగిరి మండలంలో నిర్వహించనున్నారు. 69వ ఎస్‌జీఎఫ్ అండ్14 బాల, బాలికల రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 17 నుండి 19 వరకు స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ ఉమ్మడి పది జిల్లా నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను తెలం గాణ జట్టుకు ఎంపిక చేసి వచ్చే నెలలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ నెల 18న ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు స్వల్పంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోవస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501టీఎంసీల నీరునిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఆలయాల్లో భక్తజన సందడి

- వేములవాడ, ధర్మపురిలో భక్తుల రద్దీ
- ధర్మపురిలో వైభవంగా గోదావరి హారతి


వేములవాడలో భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో భక్తజనసందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అన్నపూజ, అభిషేకం పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన సత్రంపై నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేయించుకున్నారు.

● బద్దిపోచమ్మకు బోనాలు..

రాజన్న సన్నిధిలో స్వామివారి దర్శించుకున్న భక్తులు శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం శ్రీబద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించేందుకు బారులు తీరారు. ఆలయంలో వేలాదిమంది భక్తులతో రద్దీ ఏర్పడింది. భీమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా సుహాసినులు దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

● నరసింహుడి క్షేత్రంలో..

ధర్మపురి : కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. దీంతో క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం తోడుగా సెలవు దినం కావడం వల్ల ఉదయం వరకు సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు అభిషేకం, నిత్య పూజలు జరిపారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.


ధర్మపురిలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


గోదావరి నది వద్ద హారతి పూజలు

● ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి వద్ద ఆదివారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో నాయకపుగూడెం

- కనీస వసతులు లేక గిరిజనుల ఇక్కట్లు
- నిర్మాణానికి నోచుకోని మురికి కాలువలు, సీసీ రోడ్లు
- తాగు నీటికి తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బీర్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే నాయకపు గూడెంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గూడెంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు లేవు. గూడెంలో 60 కుటుంబాలు, 180 మంది జనాభా, 110మంది ఓటర్లు ఉన్నారు. నాయకపు గూడెం కండ్లపల్లి గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ప్రజలకు తాగునీరు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

● అలంకారప్రాయంగా వాటర్‌ట్యాంక్

గూడెంలో రెండు చేతిపంపులు ఉంటే ప్రస్తుతానికి ఒక్క చేతిపంపు మాత్రమే పనిచేస్తోంది. దీంతో ఆ నీరు అన్ని కుటుంబాలకు సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పైపు లైన్లు వేసి ఇంటికో నల్లా కూడా ఏర్పాటుచేశారు. సమీపంలో ఒక వాటర్ ట్యాంక్ కూడా నిర్మించినా నీటికి కనెక్షన్ ఇవ్వలేదు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న తమ ఇళ్లకు పట్టాలు లేవని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాయకపు గూడెం అటవీ భూమి అని అందులో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇండ్లు కట్టడానికి అనుమతులు లేవని అటవీశాఖ అధికారులు అడ్డు పడుతున్నట్లు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

గిరిజన గూడెం అటవీ భూముల్లో ఉన్నప్పుడు పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలను ఎందుకు కట్టారని, ప్రజలకు నీటి సౌకర్యం అందించడం కోసం వాటర్ ట్యాంక్ ఎందుకు నిర్మించారని పలువురు గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణాలు చేపట్టినప్పుడు గుర్తుకు రాని అటవీ భూములు గిరిజనులు ఇళ్ల కట్టుకుంటేనే గుర్తుకు వస్తాయా అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఇళ్లకు పట్టాలు ఇప్పించాలి..

- గోపిరాజన్న, నాయకపుగూడెం



అటవీ భూమి అంటూ అధికారులు ఇళ్లు కట్టుకోకుండా అడ్డు పడుతున్నారు. మేము ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ప్రభుత్వం, అధికారులు మమ్ములను గుర్తించి మా ఇండ్లకు పట్టాలు ఇచ్చి గూడెంలో అభివృద్ధి పనులు చేయాలి.

● మా బాధలు పట్టించుకోవాలి..

- పెరుమండ్ల మల్లవ్వ, నాయకపుగూడెం



60 కుటుంబాలకు రెండే బోరింగ్‌లు ఉన్నాయి. అందులో ఒక్కటి పని చేయడంలేదు. బడి దగ్గర ఒక్కటే పని చేస్తుంది. వాటర్ ట్యాంక్ కట్టి ఇంటికో నల్లా పెట్టినా ఒక్క రోజు కూడా నీళ్ల రాలేదు. నాయకులు, అధికారులు మా గూడెంలో బాధలను పట్టించుకోవాలి.

జర్మనీలో ప్రపంచ వ్యవసాయ సదస్సు

- పాల్గొన్న సిరిసిల్ల జిల్లా రైతులు

కోనరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా జర్మనీలో జరుగుతున్న ప్రపంచ వ్యవసాయ సదస్సుకు రాజన్న సిరిసిల్లజిల్లా రైతులు హాజరయ్యారు. కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు, మామిడిపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రైతులు ప్రపంచ వ్యవసాయసదస్సులో పాల్గొన్నారు. సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన రైతులను జర్మనీఇండియా ఎంబసీ అధికారులు అభినందించారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయం, డేటా ఆధారిత వ్యవసాయ విధానాలు, ఏ-1సెన్సార్ టెక్నాలజీ వంటి అంశాలను నేర్చుకునేందుకు, వాటిని తెలంగాణలో అమలు చేయాలని రైతులు జర్మనీ రావడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ రైతులు చూపుతున్న ఆసక్తి భవిష్యత్ వ్యవసాయానికి దారితీసి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని మెచ్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అగ్రిటెక్ మార్పుల్లో భారత రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ఎంబసీ అభినందించింది. వేములవాడ మాజీఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొన్న రైతులను అభినందించి తన ఇంటికి ఆహ్వానించి వసతి సౌకర్యం ఏర్పాటు చేశారని మండల రైతులు తెలిపారు.


జర్మనీలో వేములవాడ మాజీఎమ్మెల్యే రమేష్ బాబుతో కోనరావుపేట రైతులు

ధన్వంతరి స్వామి కల్యాణోత్సవం

జగిత్యాల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధన్వంతరి జయంతోత్సవం, శ్రీ ధనలక్ష్మి సమేత శ్రీ ధన్వంతరి స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు అదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశిని పురస్కరించుకొని తెల్లవారుజామున సుప్రభాత సేవ చేసి ధృవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, పల్లకి సేవా, హారతి, మంత్రపుష్పం కార్యాక్రమాలు నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో ఆలయ పౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్టు రాజన్న, వేడ్నాల శ్రీనివాస్, లత, భారతాల రాజసాగర్, వడ్లగట్టు శంకర్, గోపి, ఎల్లమెల్లి సత్యానారాయణ, రాజేష్, సత్యానారయణ, పెద్ది శ్రీనివాస్, రత్నాకర్, సాయికృష్ణ, మహేందర్, మదన్, ప్రవీన్, పులి శ్రీధర్, చెన్నూరి శ్రీధర్, తిరుమల శంకర్, రసూల్, జితేందర్, అర్చకులు ప్రణయ్, నరేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

జగిత్యాల అర్బన్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో బాగంగా మూడవ రోజైన ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పుస్తకం నాకు మంచి మిత్రుడు అనే అంశం పై నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ కు చెందిన ఉపాధ్యాయుడు ప్రముఖ మోటివేషన్ స్పీకర్ శ్రీనివాస రెడ్డి విద్యార్థులు చదువులో రాణించే విదానంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు శంకరయ్య, శకుంతల, కవిత, జమున, తరంగిని తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అడ్మిషన్ పొందిన డిగ్రీ విద్యార్థులు, రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా తరగతులకు హాజరు కావచ్చని ప్రిన్సిపాల్ వెంకయ్య తెలిపారు. ఆదివారం కళాశాలలోని అంబేద్కర్ అధ్యయన కేంద్రంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ బిల్ల రాజేందర్, అకాడమిక్ కౌన్సిలర్లు కడకుంట్ల దశరథం, గంగాధర్ పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు

జగిత్యాల టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జగిత్యాల వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నేరెళ్ల సాంబశివుడి ఆలయ ప్రాంగణంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ మండలి అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణు గోపాల్‌రావు, కోశాధికారి వెన్నమనేని కృష్ణరావు, సంఘటిత కార్య దర్శులు అయిల్నేని రవీందర్‌రావు, ఇమ్మానేని ప్రశాంత్‌రావు, కార్యవర్గ సభ్యులు మేన్నేని సురెందర్ రావు, తాండ్ర అనిల్ రావు, యాచమనేని అజయ్‌రావు, బోయినిపెల్లి హరిప్రియ, శ్రీలత, రాధిక సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అందని ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

-ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు


కొడిమ్యాలలో బేస్‌మెంట్ లెవల్‌లో నిలిచిన ఇంటి నిర్మాణం

కొడిమ్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించు కుంటున్న లబ్ధిదారులకు మొదటి విడత బిల్లులు అందక పోవటంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. కొడిమ్యాల మండలంలోని వివిద గ్రామాలలో అర్హులైన 410మందికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కాగా సంబంధిత అధికారులు 386మంది లబ్ధిదారులకు మార్కవుట్ చేసారు. 286మందికి మొదటి బిల్లు, 146మందికి రెండవ బిల్లు, 74మందికి మూడవ బిల్లులు వారి ఖాతాలలో జమ అయ్యాయి. మండలంలో సుమారు 12మందికి బేస్మెంట్ లేవెల్ నిర్మాణం పూర్తయి రెండు నెలలు గడిచినా బిల్లులు రావటం లేదని లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేసారు. తొమ్మిది సంవత్సరాలుగా అదే ఇంటిలో ఉంటున్న మండల కేంద్రానికి చెందిన చొక్కాల తిరుమల ఇందిరమ్మ ఇంటి బిల్లు రావటం ఆవేదన వ్యక్తం చేసారు. సంబంధిత అధికారులు ఇంటి వద్దకు వచ్చి సిగ్నల్ రావటం లేదని తెలిపారన్నారు. సంబంధిత అధికారులు సాంకేతిక కారణాలతో బిల్లులు రాని ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు బిల్లులను చెల్లించాలని పలువురు లబ్ధిదారులు కోరారు.

బిల్లులు ఇప్పించండి

-చొక్కాల తిరుమల-లబ్ధిదారు, కొడిమ్యాల



బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మించుకొని రెండు నెలలు పూర్తయింది. సిగ్నల్ రాక బిల్లు అందటం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. తొమ్మిది సంవత్సరాలుగా ఇద్దరు పిల్లలతో అద్దె ఇంటిలో ఉంటున్నా. నాకు ఇందిరమ్మ ఇంటి బిల్లు ఇప్పించాలి.

సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం

-ఎంపీడీవో స్వరూప



ఇందిరమ్మ ఇంటి బిల్లుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. మండలంలోని 12 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సాంకేతిక సమస్యలతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. సాంకేతిక సమస్యలు పరిష్కారం కాగానే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు జరుగుతుంది. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు.

అంబేద్కర్‌తోనే నిమ్న వర్గాలకు గుర్తింపు


అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రాజ్యాంగం రాయడం వల్లనే పీడిత వర్గాలకు గుర్తింపు లబించిందని, లేదంటే ఇప్పటి వరకు అడవుల్లో పశువుల కాపరులుగా మిగిలి పోయేవారని ప్రజా సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ అన్నారు. అదివారం అంబేద్కర్ స్మరణలో బాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో అంబేద్కర్ కల్పించిన హక్కులను సాధించుకోవడంలో అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు డిక్కీ కో ఆర్డినేటర్ నల్ల శ్యాం గొడిశెల అశోక్ రాజ్, నాకుమల్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

●గొల్లపల్లి: బహుజనుల ధైర్యం డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ అని ప్రముఖ న్యాయవాది బొల్లె రాజన్న అన్నారు. ఆదివారం గొల్లపెల్లి మండల కేంద్రంలో అంబేడ్కర్ స్మరణం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బారతదేశానికి అందించిన గొప్ప వరం రాజ్యాంగం అని అన్నారు. గొల్లపెల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవుల సత్యం, చౌటపెల్లి తిరుపతి, కచ్చు కొంరయ్య, సిరికొండ తిరుపతి, తాండ్ర కిరణ్, చెవులమద్ది సంతోష్ పాల్గొన్నారు.

వరి కోత యంత్రాల కోసం పడిగాపులు

-వేధిస్తున్న యంత్రాల కొరతతో రైతుల ఇక్కట్లు


పొలం కోస్తున్న వరి కోత యంత్రం

సారంగాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు ఊపందుకోగా యంత్రాల కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. వానకాలం సాగులో వరుసగా కురిసిన వర్షాలు పంటలను తీవ్రంగా దెబ్బతీన్నాయి. పంటలు చేతికి వచ్చే సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ తుఫాన్ వల్ల వరి పంటలు పూర్తిగా నేలవాలి పోయి పంటలను కోయడం రైతులకు భారంగా మారింది. అయితే ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రైతులు తమ వరి పంటలను కోసేందుకు సిద్ధమయ్యారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ముమ్మరంగా ఒకేసారి వరి కోతలు ఊపందుకున్నాయి. దీంతో రైతులకు తమ పంటలను కోసేందుకు వరికోత యంత్రాల కొరత ఏర్పండి. ప్రతి రోజు రైతులు వరికోత యంత్రాల కోసం పడిగాపులు పడుతున్నారు. ఇదే అదునుగా బావించిన హర్వేస్టర్ యజమానులు, బ్రోకర్‌లు ధరలు పెంచారు. అయిన రైతులకు తమ పొలాలను కోసేందుకు హార్వెస్టర్‌లు లబించక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరల వర్షం కురిస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం నుంచి వరి కోత యంత్రం కోసం చూస్తున్నా

-దాసరి ప్రసాద్, రైతు. బట్టపెల్లి



నేను 7 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. పంట చేతికి వచ్చి కోద్దామనుకునే సమయలో తుఫాన్ ప్రభావంతో కోయలేక పోయాను. ప్రస్తుతం వాతవరణం అనుకూలంగా ఉండటంతో పొలం కోద్దామనుకుంటే వరి కోత యంత్రం దొరకడం లేదు. వారం రోజుల నుంచి హార్వెస్టర్ల కోసం తిరుగుతున్నా. ముమ్మరంగా కోతలు నడుస్తున్నాయి. దీంతో హార్వెస్టర్ల కొరత ఏర్పడింది. మరల వర్షం వస్తే పరిస్థితి ఏమిటని ఆందోళనగా ఉంది. ఇప్పటికే పంటలు నేలవాలి పోయి తీవ్రంగా నష్ట పోయాం.

స్కావెంజర్ల జీతాలు ఖాతాల్లో జమ చేయాలి

రాయికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్యానికి పరిశుభ్రతకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్కావెంజర్ల జీతాలు నేరుగా వారి అకౌంట్‌లలో జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టీవైఎంఎస్‌ఈయూ రాష్ట్ర శాఖ పక్షాన వినతి పత్రం పంపినట్లు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ తెలిపారు.

బలహీన వర్గాల సంక్షేమానికి పోరాటం

కోరుట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల సంక్షేమం కొరకు నిరంతరం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తుందని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి అన్నారు. ఆదివారం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత కోరుట్ల పట్టణానికి చెరుకుంది. కోరుట్ల పట్టణానికి విచ్చేసిన ప్రచార జాతకు స్థానిక కార్మిక సంఘ నాయకులు, బీడి కార్మికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాష్ట్ర నాయకులు కలవేని శంకర్, అనిల్ కుమార్, పలెల్ల నరసింహం, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ముక్రం, రాధ, రామిల్ల రాంబాబు, సమీర్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో గ్రామాల అభివృద్ధి

కోరుట్ల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవ కార్యక్రమాల ద్వార గ్రామల అభివృద్ధి సాధించవచ్చునని కోరుట్ల మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ప్రొపేసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ, వ్యవసాయ కళాశాల పోలాస ఆధ్వర్యంలో అయిలాపూర్ గ్రామంలో జాతీయ సేవ పథకం శిబిరం ముగింపు కార్యాక్రంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి పాల్గొన్ని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ్ భట్, కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ మధు బిందు, డాక్టర్ రత్నాకర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ అర్చనలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే


మంత్రి అడ్లూరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌కుమార్

ధర్మపురి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆదివారం జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యే నవీన్‌కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కీలక పాత్ర పోషించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నవీన్‌కుమార్ యాదవ్ హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సోమాజిగూడ డివిజన్ పరిధిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం చూపిన అంకిత భావం, కఠిన శ్రమ పలితంగా కాంగ్రెస్ పార్టీకి అధిక మెజార్టీ లభించింది. ఈ సందర్భంగా తన విజయంలో కీలక పాత్ర పోషించినందులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు నూతన ఎమ్మెల్యే నవీన్‌కుమార్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్వర స్నేహం ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల టౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సన్మార్గంలో నడిపించే శక్తి సంగీతం, సాహిత్యాల సొంతమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పుల్లూరి నారాయణదాసు ఆశ్రమ ఆవరణలో సంగీత, సాహిత్య, సామాజిక సేవా సంస్థ, కలం స్నేహం అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో స్వర స్నేహం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ సాధారణ వ్యక్తులను సైతం సంస్కార వంతులుగా తీర్చిదిద్దే శక్తి సంగీత, సాహిత్యాలకు ఉందని.. సాహితి వేత్తలను గౌరవించడం మన బాధ్యత అని అన్నారు.

మహిళల్లో చైతన్యాన్ని నింపాడానికి ఇలాంటి స్వర స్నేహం వంటి ఆత్మీయ సమ్మేళనాలు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. మహిళలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సంగీత నాట్యరంగంలో వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం సంగీత సాహిత్య రంగంలో విజేతలుగా నిలిచినవారికి బహుమతులను ప్రాధాన్యం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీమాన్ గోపాల్ ఆచార్య, రాయికల్ ఎమ్మార్వో నాగార్జున, గౌరవ అధ్యక్షురాలు మేడిపల్లి రాధా, గగడం రచన, సంగం పద్మ, కొండూరు శ్రీలత, భానుప్రియ, రాధిక, మమత, శైలజ, పుష్ప రెడ్డి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణ పేదల కోసం నూకపెల్లి అర్బన్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు జగిత్యాల నాయకులకు రాజకీయంగా, ఆర్థికంగా ఏటీఎంగా మారాయని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ళు నిర్మించాలనే ఉద్దేశ్యంతో 2009లో 4 వేల మందికి లే ఔట్‌తో ఇండ్లు మంజూరు చేశామన్నారు. అయితే గత ఎన్నికలకు ముందు డబుల్ బెడ్ రూం ఇండ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం కాకుండానే రాజకీయ లబ్ధికోసం 3 వేల 5 వందల మందిని గుర్తించి ఇండ్లు కేటాయించారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం 240 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మౌళిక వసతుల కోసం మరో 40 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారన్నారు. నిజమైన అర్హులు ఇప్పటికి ఇంటి కోసం ప్రజావాణిలో ప్రతి వారం దరఖాస్తులు ఇస్తునే ఉన్నారని వారిని గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని సూచించారు.

●రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో బహిరంగ ఓటు చోరీకి కుట్ర జరుగుతుందని జీవన్ రెడ్డి ఆరోపించారు. నూకపెల్లి అర్బన్ కాలనీలో జగిత్యాల లోని నిరుపేదలకు ఇచ్చిన 3 వేల 5 వందల ఇండ్లలో 10 వేల ఓట్లు ఉంటాయని వారందరి ఓట్లను నూకపల్లి అర్బన్ కాలనీకి బదిలీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, నాయకులు పాల్గొన్నారు.

లహుజీ సాళ్వే జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

జగిత్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆద్యా క్రాంతి పిత లహుజీ సాళ్వే జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాడేకర్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టీఆర్ నగర్‌లో లాహుజీ సాళ్వే 231వ జయంతి వేడుకలను రాష్ట్రీయ స్వతంత్ర సంకల్ప దివాస్ పేరిట నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాహుజీ సాళ్వే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. లహుజీ సాళ్వే సేవలను కొనియాడుతూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం వివాహం చేసుకోకుండా జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాంగ్ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాంపల్లె యాదవ్, నాయకులు గాడేకర్ నర్సింగ్, గణేష్, అనిత, లొండె లక్ష్మీబాయి ఉన్నారు.

ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి

డీఆర్‌డీవో రఘువరణ్


మాట్లాడుతున్న డీఆర్‌డీవో రఘువరణ్

కొడిమ్యాల, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలో తూకం వేసి ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని డీఆర్‌డీవో రఘువరణ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో, మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సెంటర్ ఇన్‌చార్జ్‌లతో, కొనుగోలు నిర్వహకులతో మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని తేమ శాతం చూసుకొని తూకం వేయాలన్నారు. కేంద్రాలకు ఎంత ధాన్యం వచ్చింది. మిల్లులకు ఎంత ధాన్యం పంపించారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునేలా చూడాలని సివిల్ సప్లై అధికారులతో మాట్లాడారు. డీఆర్‌డీవో వెంట ఏపీఎం మల్లేశం, సీసీ వీరకుమార్, వీ.వో.ఏ.లు మౌనిక, అన్నపూర్ణ, కమిటీ సభ్యులు, రైతులు రవీందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి ఉన్నారు.

స్థానిక పోరుపై ఉత్కంఠ

(ఐదో పేజీ తరువాయి)

తీసుకుం టారా..? అనే సందిగ్ధతకు తెర పడే అవకాశం ఉంది. కాగా ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన పూర్తి కసరత్తు చేసింది. ఈసారి ప్రభుత్వం ఎన్నికలపై స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డిసెంబరు రెండో వారంలో లేదంటే జనవరి మొదటి వారంలో పరిషత్ లేదా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నగారా మోగ నున్నట్లు తెలుస్తోంది. 50 శాతం రిజర్వేషన్లు దాటకుండానే కోర్టు నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నట్లు వివిధ రాజకీయ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

-కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. ఆదివారం కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈఆర్‌ఎస్‌టీవిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-18 ఖోఖో టౌర్నమెంట్ మరియు సెలక్షన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్ని క్రీడాకారుల పరిచయం చేసుకున్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడలో రాణించి రాష్ట్రానికి పేరు తేవాలని సూచించారు. ఖోఖో క్రీడ పోటీలను జువ్వాడి కృష్ణారావు తన అనుచరులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూమారు మూడు దశాబ్దాల అనంతరం ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు అలనాటి తీపి గురుతులను ఒకరినొకరు పంచుకున్నారు. ఆటా, పాటలు, చిలిపి చేష్టలు, మరుపురాని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను శాలువాతో సన్మానించి పాదాభివందనం చేశారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి ఈ పాఠశాలకు వచ్చి చదువు నేర్చుకున్నా ఆనాటి మధుర క్షణాలను గురుతుచేసుకున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్

కోరుట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : షుగర్ వ్యాధి నివారణకు కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆదివారం పట్టణంలో డయాబెటిక్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా నంది చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు 2కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ



2కే రన్ ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జీవన్‌రెడ్డి, గుంటుక సురేష్ బాబు, అజయేందర్ రావు, పోతని ప్రవీన్ కుమార్, అడెపు మధు, అల్లాడి ప్రవీణ్ కుమార్, మంచాల జగన్, గుణాకర్ రెడ్డి, అన్నం అనిల్ కుమార్, పోతని నవీన్ కుమార్, చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ధాన్యమే..!


రామన్నపేట-రాంపూర్ రహదారి పక్కనే ధాన్యం రాశులు

మల్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో వరి ధాన్యం దిగుబడులు పెరడగంతో వాటి విక్రయాలకు స్థలం కరువైంది. దీంతో మండలంలో రహదారుల వెంట, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామం, వరదకాలువ గట్లు, మట్టి కుప్పలపై ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. ఇటీవల ధాన్యం కొనుగోల్లు నత్తనడకన సాగుతుండడంతో ధాన్యంను కాపాడుకోవడానికి, ఆరబోయడానికి రైతులు పాట్లు పడుతున్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది..?

-ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు


రాజారం నుంచి పోతారం వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్త

మల్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. చాలా గ్రామాల్లో రహదారులపై అపరిశుభ్రత ప్రజలను అసౌకర్యంకు గురి చేస్తోంది. రాజారంలో రహదారులపైనే చెత్తను కుప్పలుగా పడేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.